క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు పరికరాల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు పరికరాలను అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో పారిశుధ్య కార్మికులకు కర్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పనిముట్లను అందజేశారు. మంగళవారం స్థానిక మాధవస్వామి కల్యాణమండపంలో ప్రభుత్వం అందించిన ట్రై సైకిల్ వీల్‌బార్లు 8, 18 స్టీల్ బేసిన్లను అందించారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా ఒక్కొక్కరికి 12 సబ్బులు అందించి, ప్రజారోగ్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు జోసెఫ్, శ్రీను, గంగరాజు, హేమంత్, రేష్మ, భాస్కర్, శానిటరీ సూపర్‌వైజర్లు రమేష్, శ్రీను, కొండబాబు, కరిమిరెడ్డి శ్యామ్, రెయ్యి గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాబ్రిక్ పెయింటింగ్ శిక్షణ

సీతమ్మధార : స్థానిక శ్రీకృష్ణమందిరం, గురువాయురప్పన్ అవరణలో బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగిన ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాష్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు తమకు ఇష్టమైన అంశంపై పట్టు సాధించేందుకు ఇలాంటి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందించారు. శిక్షణ శిబిరం డైరెక్టర్ యామిని మాట్లాడుతూ ఈ శిక్షణలో సుమారు 30 మంది పాల్గొన్నారని, వారికి పెయింటింగ్‌లో మెలకువలు నేర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, డా.బాబ్జి, మహాలక్ష్మి, సుధ పాల్గొన్నారు.

గాయనీ గాయకులకు సత్కారం

సీతంపేట : ప్రముఖ గాయకుడు, విశ్రాంత ఏడీసీపీ మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో గత నెల 30న 10 గంటల పాటు 5 భాషలలో 15 మంది గాయనీమణులతో 140 సినీ గీతాలు ఆలపించి లిమ్కా బుక్, వండర్ బుక్ ఆఫ్ తెలుగు రికార్డ్స్, ఇండియా బుక్, ఆసియా బుక్ రికార్డ్స్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక పౌరగ్రంథాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మహమ్మద్ ఖాన్‌తో పాటు పాల్గొన్న 15 మంది గాయనీమణులను ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆచార్య జీ.ఎస్.ఎన్.రాజు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు ఫణిస్వామి, ప్రభాకర్, సన్‌మూర్తి, కొణతాల రాజు, రవితేజ, మస్తాన్‌రెడ్డి, జీ.వి.త్రినాథ్, భాస్కరాచారి పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

తాటిచెట్లపాలెం : పరదేశమ్మ పండగ సందర్భంగా గవర తాటిచెట్లపాలెం సంతోషిమాత గుడి వద్ద శ్రీ లక్ష్మీనారాయణ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ నార్త్ బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగామహేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పోతల కన్నప్పడు, పెద్ది గురువులు, గౌరిసిపూడి ప్రసాద్, ఇజ్జి గురుమూర్తి, పంచోతుల చిన్నారావు, పెద్ది శ్రీను, ఇజ్జి భాస్కరరావు, గోక రామారావు, కాయల రామారావు, ద్వారం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండవాలులో జంగిల్ క్లియరెన్స్

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం, శ్రీనివాస్‌నగర్, జైభారత్‌నగర్, జవహర్‌లాల్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో మంగళవారం వార్డు కార్పొరేటర్ గంకల కవిత పర్యవేక్షణలో జీవీఎంసీ హార్టికల్చర్ సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. కొండవాలులో చెట్ల కొమ్మలు విపరీతంగా పెరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వార్డు పర్యటనలో స్థానిక ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంబంధిత విభాగాల అధికారులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నడిచే దారే లేదాయే!

జీవీఎంసీలో అత్యధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో జోన్–5 ఒకటి. ఇక్కడ పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేసినా, అధికారుల నిర్లిప్తత, సిబ్బంది ‘మామూళ్ల’ వైఖరి వెరసి ఆక్రమణలకు, చిరు వ్యాపారాలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో పాదచారులు సర్వీసు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. ఈ రోడ్లను కూడా దుకాణదారులు తమ వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తుండటంతో స్థానికులకు ఇబ్బందులు నిత్యకృత్యమయ్యాయి.



రెడ్డికంచరపాలెంలో అసంపూర్తిగా బీఆర్‌టీఎస్ కల్వర్టు



కంచరపాలెం కూడలిలో కానరాని ఫుట్‌పాత్‌లు

- ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా వాహనాల నిలుపుదల
- ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాలు
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ, ట్రాఫిక్ యంత్రాంగం

కంచరపాలెం : జీవీఎంసీ జోన్–5 పరిధిలో చేపట్టిన ఏ అభివృద్ధి కార్యక్రమమైనా మూణ్నాళ్ల ముచ్చటగానే ఉంటోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బీఆర్‌టీఎస్ మార్గాల్లో అభివృద్ధి చేసిన నడక మార్గాలు ప్రస్తుతం వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారాలకు నిలయాలుగా మారాయి. కొన్ని చోట్ల ఇవి శిథిలావస్థకు చేరుకుని, ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి మర్రిపాలెం, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు, జ్ఞానాపురం, కాన్వెంట్ కూడలికి వెళ్లే మార్గాల్లో ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసినా, నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పాడైన వాటిని అలానే ఉంచేయడంతో, కొన్ని చోట్ల నడిచేందుకు్కాడా వీల్లేని దుస్థితి నెలకొంది. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా, జ్ఞానాపురం, కాన్వెంట్ కూడలిలో ఫుట్‌పాత్‌లను పాదచారులకంటే వాహన చోదకులే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో పాదచారులు బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్లలో నడవాల్సి వస్తోంది. పలుచోట్ల ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు, దుకాణ యాజమానుల వాహనాల పార్కింగ్ జరుగుతున్నా జోన్–5 పట్టణ ప్రణాళిక విభాగం, ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జోన్ అధికారుల నిర్లక్ష్యం

జోన్–5 పరిధిలో నడక మార్గాల అభివృద్ధికి కాంక్రీటుతో చదును చేసి, పైన టైల్స్ వేశారు. అయితే ఆయా ప్రాంతాల్లో కల్వర్టుల నిర్వహణ మాత్రం తూతూమంత్రంగానే ఉంది. బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా కల్వర్టుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను యంత్రాలతో తొలగించే సమయంలో సిమెంటు దిమ్మెలు విరిగిపోతున్నాయి. వీటిని అధికారులు అలానే వదిలేస్తున్నారు. మరోవైపు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

అడ్డుకోవాల్సిన అధికారులు, సిబ్బంది ‘మామూళ్ల’గా మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాల నిర్వాహకులు తమ భవనాల సెల్లార్లలోకి వాహనాలను అనుమతించట్లేదు. వీరు నడక మార్గాలనే తమ వద్దకు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు.

చర్యలు చేపడతాం



బీఆర్‌టీఎస్ రహదారిలో దుకాణాల యజమానులు కొందరు కోర్టును ఆశ్రయించడంతో అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. వాణిజ్య సముదాయాల యజమానులు, వాహన చోదకులకు పార్కింగ్‌పై అవగాహన కల్పిస్తాం. ఫుట్‌పాత్‌ల నిర్వహణపై ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులను సమావేశపరచి సమస్యల నియంత్రణకు చర్యలు చేపడతాం. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఫుట్‌పాత్ ఆక్రమణ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఆర్.జీ.వి.కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్–5

ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సే లక్ష్యం



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కేకే రాజు, బర్కత్ అలీ తదితరులు

మద్రిపాలెం : ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం 53వ వార్డులోని మహారాణీవీధి–1, మొహిద్దీన్ గార్డెన్స్ ప్రాంతంలో కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ, సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల ద్వారా కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో లబ్ధిదారులకు విశేష సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ఎం.సునీల్, ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ మెంబర్ అంబటి శైలేష్, డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు, జీసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు నాయకులు జ్ఞానేష్, షేక్‌బాబ్జి, హనుమంతు, సుశీల, జ్యోత్స్న, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలు నిలిపివేయడం సరికాదు



రైల్వేక్వార్టర్స్‌లోకి వెళ్తున్న కేకే రాజు, జాయింట్ కలెక్టర్ తదితరులు

మద్రిపాలెం : రైల్వేక్వార్టర్స్ రహదారిపై రాకపోకలు నిలిపివేయడం సరికాదని జీవీఎంసీ 53వ వార్డు మొహిద్దీన్ గార్డెన్స్ ప్రజలు ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజుతో మొరపెట్టుకున్నారు. రాణా ప్రతాప్‌నగర్, మొహిద్దీన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ఆయన్ని స్థానికులు కలిశారు. తక్షణం స్పందించిన ఆయన జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. వెంటనే అధికారులు అక్కడకు చేరుకుని ప్రజలతో మాట్లాడారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

యూఎల్‌సీ భూములపై అవగాహన



లబ్ధిదారులకు వివరిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం యూఎల్‌సీ భూములకు కొత్తగా ప్రవేశపెట్టిన జీవో నెం.84 నిబంధనలపై లబ్ధిదారులకు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలోని సచివాలయంలో మంగళ వారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పాల్గొని అవగహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 150 గజాల్లోపు ఉన్నవారికి ఉచితంగా, 151 నుంచి 300 గజాల్లోపు ఉన్నవారికి ప్రసుత్త మార్కెట్ ధర్లపై 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, ఆపై స్థలానికి 100 శాతం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఆర్ఐ రవికృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైల్వేకాలనీలో డీఆర్ఎం తనిఖీలు



రైల్వేకాలనీలో పర్యటిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : రైల్వేకాలనీలలో అందుతున్న వసతులు, సదుపాయాలను తెలుసుకునేందుకు వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మంగళవారం రాత్రి మద్రిపాలెం రైల్వే కాలనీలో పర్యటించారు. రైల్వే స్థలాల పరిరక్షణ, అనధికార వాహన పార్కింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్, అనధికార మతపరమైన నిర్మాణం గురించి ఆరా తీశారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీస్థలాలలో బారికేడ్లు ఏర్పాటుచేసి స్థలాలను పరిరక్షించాలన్నారు. కాలనీలో ఇతరుల పార్కింగ్‌ను కట్టడి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్‌కే సారంగి, అసిస్టెంట్ ఇంజినీర్ కే నాగేశ్వర్రావు, ఎలక్ట్రికల్, సివిల్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ పరిధిలోని పరదేశమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. సోమవారం సాయంత్రం దొండపర్తి నుంచి తొలేళ్ల ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం ప్రధాన పండగ సందర్భంగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నిర్వహించిన పరస గ్రామీణ వాతావరణాన్ని తలపించింది. ఈ నెల 23న మారువారం సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి అనిల్‌భవాని ఆధ్వర్యంలో మహిళలచే గొప్ప సారె సమర్పించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఫోర్త్‌టౌన్ వద్ద వ్యాన్ డ్రైవర్ల ఆందోళన



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన డ్రైవర్లు

సీతమ్మధార: అక్రమ అరెస్టులు ఆపాలని కోరుతూ వ్యాన్ డ్రైవర్లు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. జీవీఎంసీ జోన్–4, 5లో విధులు నిర్వర్తిస్తున్న 23 మంది వ్యాన్ డ్రైవర్లను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో డ్రైవర్లు భారీగా తరలివచ్చి స్టేషన్ వద్ద నినదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ అక్రమ అరెస్టులు ఆపాలని, డ్రైవర్లపై కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవోలు అమలు చేయని అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా, న్యాయం చేయాలని అడిగిన వారిని అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ఇదే వైఖరి కొనసాగితే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 108 మంది ఎంపిక

మద్రిపాలెం : 51వ వార్డు మాధవధారలో శ్రీపాద డిగ్రీ కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు మంగళవారం నిర్వహించారు. మేజిక్ బస్ ఇండియా వైజాగ్ ఆధ్వర్యంలో ఐదు కంపెనీల ప్రతినిధులు 306 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, 108 మందిని ఎంపిక చేశారు. అందులో 84 మంది అదే కాలేజీలో చదువుకున్న విద్యార్థులు. వారిని కళాశాల కరెస్పాండెంట్ ఎస్.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు శ్రీకాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వడగాడ్పులపై జాగ్రత్తలు తీసుకోండి



బుద్ధ మునిస్వామి అసిస్టెంట్ లేబర్ కమిషనర్

సీతంపేట : వేసవి కాలం ఎండలు, వడగాడ్పులు తీవ్రంగా ఉన్నందున అసంఘటిత కార్మికులు, కూలీల కోసం యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కిల్–2 సహాయ కార్మిక కమిషనర్ బుద్ధ మునిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అవకాశం ఉన్నంత వరకు పని వేళల్లో మార్పులతో పాటు, పని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు. ప్రతి 15 నుంచి 20 నిమషాలకు గ్లాసు మంచినీరు/మజ్జిగ/ఓఆర్‌ఎస్‌ను తీసుకునేలా యజమానులు అందుబాటులో ఉంచాలన్నారు. భవన నిర్మాణకార్మికుల కోసం పని చేసే చోట ఐస్ ప్యాక్స్, వడగాడ్పుల నుంచి రక్షణ సామగ్రి తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈశ్రమ్ నందు, వైఎస్సార్ బీమాలో నమోదు కాబడిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడు కార్మిక సంక్షేమ బోర్డు నందు రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న భవన నిర్మాణ కార్మికులు ఆధార్ అనుసంధానం చెయ్యని వారు అక్కయ్యపాలెం కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

స్నేహితుల మధ్య ఘర్షణలో ఒకరికి గాయాలు

మద్రిపాలెం : ఒకే ప్రాంతానికి చెందిన ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణతో ఒకరికి గాయాలైన ఘటన కంచరపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. బర్మాక్యాంప్ ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన ఎం.రాజు ఆటో నడుపుతుంటాడు. అతను పెంచుకుంటున్న కుక్క విషయంలో స్నేహితుడు శ్రీనుతో ఈ నెల 7న వాగ్వాదం జరిగింది. దీంతో రాజు తలపై ఇనుపరాడ్డుతో శ్రీను గాయపరిచాడు. దీంతో రాజుని కేజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందించారు.

అతనికి గాయాలు తగ్గుముఖంపట్టాక మంగళవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా భోగలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం



దుర్గమ్మకు సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం ఇందిరానగర్–5లో గణపతి దుర్గా సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి దంపతులు తొలిపూజ చేశారు. వేడుకల్లో భాగంగా దుర్గమ్మకు గ్రామ మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఐస్ గడ్డలతో ఏర్పాటు చేసిన దుర్గా, మహాశివుడు, వినాయకుని విగ్రహాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కర్రి అప్పారావు, సురేష్, ఎర్రా శ్రీను, రామారావు, రమణ, త్రినాథ్, దేవుడమ్మ, ఈశ్వరి, దేవి, మణి, అనసూయ, లక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ మారువారం జాతర

కంచరపాలెం : స్థానిక గొల్లకంచరపాలెం ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి మారువార జాతర మహోత్సవం శ్రీరామాసేవా సమాజం(యాదవ్) అధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. దుర్గానగర్‌లోని దుర్గా ఆలయంలో ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజి వేషాలు, నేల డాన్సులు ఏర్పాటు చేశారు. తోటవీధిలో పుట్టబంగారం నుంచి అమ్మవారి ప్రధాన దేవాలయం వరకు జాతర వేడుకలు నిర్వహించారు. జాతర నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా పైడితల్లమ్మ అనుపు మహోత్సవం



ప్రసాద వితరణ చేస్తున్న సత్తి రామకృష్ణారెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 24 వార్డు రేసపువానిపాలెం ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి నవరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి అనుపు మహోత్సవం సందర్భంగా భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సాముగరిడి, పులివేషాలు, నేల వేషాలు, కోబ్రా డ్యాన్సలతో భారీ ఊరేగింపు మధ్య అమ్మవారిని అనుపు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహనతో డెంగ్యూ దూరం



ఎన్జీజీవోస్ కాలనీలో విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ



డెంగ్యూ దోమలపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి, హెల్త్ అసిస్టెంట్‌లు

సీతంపేట : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఉత్తర నియోజకవర్గం పరిధిలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది మంగళవారం ర్యాలీలు నిర్వహించి, కరపత్రాల పంపిణీ ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కలిగించారు.

నరసింహనగర్‌లో..

నరసింహనగర్ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రశాంతివర్మ మాట్లాడుతూ డెంగ్యూ దోమలు నిల్వ ఉన్న నీరు, వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి, నీటి నిల్వలను మార్చడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించి, డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్‌లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు జి.నాగలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, ఆర్.లక్ష్మి, ఉషాకిరణ్, కల్పన, వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

అక్కయ్యపాలెంలో..

స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలో విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళ వారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ దోమల కాటు నుంచి రక్షణకు దోమ తెరలు వాడటం, శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు తంబది, ఎం.కమలమ్మ, షానాజ్, భాగ్యలక్ష్మి, వైసీహెచ్ రాణి, ఈశ్వరమ్మ, ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, జగదీశ్వరి, హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ కామరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగ్యూ వ్యాధి నియంత్రణ

సీతమ్మధార : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా రేసపువానిపాలెంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మనస్వి మాట్లాడుతూ హెమరేజిక్ జ్వరం, కడుపులో తిమ్మిరి, వాంతులు, వికారం, రక్త స్రావం వంటి లక్షణాలుంటే డెంగ్యూగా భావించి, రక్తలు పరీక్షల ద్వారా నిర్ధారించుకుని, తగు మందులు తీసుకోవాలన్నారు. డెంగ్యూ నివారణకు ఉత్తమ మార్గం దోమలకు దూరంగా ఉండటమేనన్నారు. డెంగ్యూ వాహక దోమలు సాధారణంగా సూర్యాస్తమయం, సూర్యోదయానికి ముందు చురుకుగా ఉంటాయన్నారు. దోమ తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. నీటి తొట్టెలపై మూత వేసుకోవాలని, నీటి నిల్వలు రోజుల తరబడి ఉంచరాదన్నారు. ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, హెల్త్ అసిస్టెంట్‌లు, హెల్త్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

మద్రిపాలెం : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా 53వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శివనగర్ లో ఉన్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది డెంగ్యూ దోమకాటు వల్ల ప్రమాదాలను వివరించారు. అనంతరం నోడల్ అధికారి నాగశ్రీను ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి మద్రిపాలెం మహారాణిపేధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దోమకాటు ప్రమాదకరమని, దానివల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడా మురుగు నీరు నిల్వ లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏంజిలీనా, స్టాఫ్ నర్సులు ఆశ, సత్య, ఫార్మసిస్ట్ మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ మధు, హెల్త్ అసిస్టెంట్‌లు కృష్ణమోహన్, నాగరాజు, ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ముస్లిం చిన్నారులకు ఖత్నా

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో సీరత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నా(సున్నీ) వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో సుమారు 200 మంది పేద ముస్లిం పిల్లలకు ఖత్నా చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీరత్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, సెక్రటరీ మెహబూబ్ షరీఫ్, ట్రెజరర్ ముస్తాక్ అహ్మద్, వ్యవస్థాపకులు ఎండీ షబ్బీర్, మహ్మద్ రఫీ, ఎస్‌కే అహ్మద్ వలీ, ఎస్‌కే ఇస్మాయిల్, మహ్మద్ రహమతుల్లా, హైదర్ ఆలీ సింకా, అబ్దుల్ మునీర్, ఎండీ మెహబూబ్ అలీ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

సీతమ్మధార : గంజాయి కేసులో ఒక వ్యక్తిని ఫోర్తు టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 9వ తేదీన ఏజెన్సీ ప్రాంతం నుంచి కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులకు ముందస్తు సమాచారంతో శ్యామ్‌దాస్, అవినాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్ప గించారు. ఈ కేసుకు సంబంధించి మరో వ్యక్తి తప్పించుకున్నాడు. దీంతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్సు పోలీసులు పరారైన ఆగస్టీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి సెల్, రూ. ఆరువేలు స్వాధీనం చేసుకున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

మద్రిపాలెం : కంచరపాలెం పరిధిలో యువతి అదృశ్యమైంది. 5వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు. కంచరపాలెం మెట్టు, ధర్మానగర్‌లో కరుణ కుమారి(20) టైలరింగ్ నేర్చుకుంటోంది. సోమవారం బయటకు వెళ్లిన ఆమె ఇంటికి చేరుకోలేదు. దీంతో సోదరుడు అవినాష్ ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.